గాంధీనాయక్‌కు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రెండోరోజూ కొనసాగిన గాంధీనాయక్ దీక్ష

రైతుల పంటరుణాలు మాఫీ చేయాలని డిమాండ్

కొడకండ్ల, అక్టోబర్ 11 : ఎలాంటి షరతులు లేకుండా రైతులకు సంబంధించి రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని బీఆర్ఎస్ నేత, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో 48 గంటలు చేపట్టిన గాంధీనాయక్ ఉపవాస దీక్ష రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింది రామోజీ, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ ధరావత్ జ్యోతి, చెంచు రాజిరెడ్డి, రమేశ్ రాజ్‌కుమార్, మహేశ్, వెంకన్న, కనకయ్య, సోమాని, ఉపేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిజర్వేషన్లు పాటించాలి

రఘునాథపల్లి, అక్టోబర్ 11 : త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసి ఆయా వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయ బృందం అణగారిన వర్గాలను గెలిపించేలా సహకరించాలని కైలాసం కోరారు.

ప్రమాణ స్వీకారానికి ముందే వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పదవికి రాజీనామా

వైస్ చైర్మన్ పదవి రాలేదని కాంగ్రెస్ నేత ఆవేదన

రాజీనామా పత్రాన్ని ఇస్తున్న బొందయ్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయగా, ప్రమాణ స్వీకారానికి ముందే రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత ఉదంతమిది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాఘువాపూర్‌కు చెందిన కాసాని బొందయ్యకు స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవి వస్తుందని గతంలో జోరుగా ప్రచారం జరిగింది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా సింగపురం ఇందిర గెలుస్తుందని, తనకు పదవి ఖాయమని బొందయ్య భావించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో సింగపురం ఇందిర ఓడిపోవడం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో కాంగెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి సతీమణి లావణ్యకు కేటాయించారు. అయితే కనీసం మార్కెట్ వైస్ చైర్మన్ పదవినైనా ఇస్తారని బొందయ్య ఆశించారు. కానీ బుధవారం రాత్రి మార్కెట్ చైర్‌పర్సన్‌గా జూలుకుంట్ల లావణ్యా శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నూకల ఐలయ్య, డైరెక్టర్‌గా కాసాని బొందయ్యను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నెల 14న పాలక మండలి ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అయితే మార్కెట్ డైరెక్టర్ పదవి చేపట్టడానికి తాను సుముఖంగా లేనని పేర్కొంటూ బొందయ్య తన అనుచరులతో కలిసి పదవికి రాజీనామా చేస్తూ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్‌కు శుక్రవారం రాజీనామా పత్రాన్ని అందించడం చర్చనీయాంశమైంది.

కడియం, తాటికొండ దసరా శుభాకాంక్షలు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి దసరా వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ పండుగ మీ అందరికీ శుభాలు అందించాలని వారు ఆకాంక్షించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

WANTED HOSPITAL STAFF

★PHARMACY BOYS (మందుల షాపు), OT BOYS (ఆపరేషన్ థియేటర్), SUPERVISIORS (Administrators) & LAB TECHNICIANS కావలెను. సంప్ర : గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM.
NTW-0436

PLOT FOR SALE



★యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Contact: 8106340199.
NT-333076

SHUTTERS FOR SALE

★హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర|| సెల్: 8686778662.
NTW-326423

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కడవెండిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తిలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

కేశిరెడ్డిపల్లిలో అన్నదానం చేస్తున్న జితేందర్‌రెడ్డి

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- దుర్గామాత మండపాల్లో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు
- జిల్లాలో పలుచోట్ల భక్తులకు అన్నదానాలు

తాటికొండలో పూజలు చేస్తున్న సుధీర్‌రెడ్డి

బచ్చన్నపేట/దేవరుప్పుల/పాలకుర్తి/స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బచ్చన్నపేట మండలం ఆలింపూర్, కేశిరెడ్డిపల్లిలో శుక్రవారం దుర్గామాత మండపాల వద్ద నిర్వాహకులు కుంకుమార్చన నిర్వహించారు. రెడ్డి సంఘం, మహంకాళమ్మ చౌరస్తా, ముదిరాజ్ వాడలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు చోట్ల అన్నదానాలు చేశారు. కేశిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ నేత ఇమ్మడి జితేందర్‌రెడ్డి హాజరై అన్నదానం చేశారు. ఆలీంపూర్‌లో రాక్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు, భక్తులు భక్తి శ్రద్ధలతో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ప్రజలను చల్లంగ చూసి, పాడి పంటలు సమృద్ధిగా పండేలా దీవించు తల్లీ అని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు నరెడ్ల బాల్‌రెడ్డి, ఎండీ మసూద్, దండ్యాల కరుణాకర్‌రెడ్డి, పరమేశ్, దినేశ్, నర్సింహులు, కర్ణాకర్, రాజు, కనకయ్య, రమేశ్ , భాస్కర్‌రెడ్డి, రణధీర్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు పోచన్నపేటలో దుర్గామాత మండపాన్ని నర్మెట సీఐ అబ్బయ్య, బచ్చన్నపేట ఎస్సై హమీద్ సందర్శించి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలను చల్లంగ చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దేవరుప్పుల మండలం కడవెండిలో సంస్కార్ యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దుర్గామాత విగ్రహం వద్ద అర్చకుడు బీట్కూరు సంపత్కుమారాచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదంతోపాటు అన్నప్రసాదం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పక్షాన కాంగ్రెస్ నాయకులు దేవీనవరాత్రోత్సవాల నిర్వాహకులైన సంస్కార్ యూత్‌కు నగదు కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి లీనారెడ్డి, పంతం అచ్చయ్య, పసునూరు సుధాకర్, పెద్ది సోమయ్య, పాముకుంట్ల సోమయ్య, పసునూరు సంపత్, మాసంపల్లి భాస్కర్, మైనాల రమేశ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

పాలకుర్తిలో చండీహోమం

పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చండీహోమంతోపాటు పూర్ణాహుతి, కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గంగు దీపక్‌శర్మ, గంగు రఘుశర్మ పాల్గొన్నారు. మరోవైపు గుడివాడ చౌరస్తా, శాంతినగర్, గౌడ కాలనీతోపాటు పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

ఆలయ కమిటీకి విరాళం

స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామ కనకదుర్గ ఆలయ కమిటీకి శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా సుధీర్‌రెడ్డి దంపతులు రూ.5 వేలు విరాళం అందించారు. అనంతరం మహిషాసురమర్దిని రూ పంలో దర్శనమిచ్చిన కనుకదుర్గాదేవిని వారు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పండుగ రాజేశ్వర్, బుచ్చయ్య, పర్శ రాజు, కనకయ్య, పీ రవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : బడుగు, బలహీన వర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.125 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి నవంబర్‌లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందించడం తోపాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పథకం చేపట్టామన్నారు. మొదటి విడుతలో రాష్ట్రంలోని 28 నియోజవర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు ఇచ్చారని శ్రీహరి వివరించారు. మొదటి విడుతలోనే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశానని, బాసర ట్రిపుల్ ఐటీలో వెయ్యి నుంచి 1500 అడ్మిషన్లు పెంచామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 11 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా, ఇక్కడ డిగ్రీ కళాశాల, వంద పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీశ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, గడ్డమీది సురేశ్, అంబటి కిషన్ రాజు, సింగపురం వెంకటయ్య, బ్రహ్మారెడ్డి, రాంబాబు, లింగాజీ, తోట వెంకన్న, పోగుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

గాయపడిన మహోన్నత్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 11 : వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండస్ట్రియల్ ఏరియాలోని ఐస్‌క్రీమ్ పార్లర్‌కు ఏడేళ్ల బాలుడు మాధంశెట్టి మహోన్నత్ శుక్రవారం సైకిల్‌పై వెళ్తుండగా వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. బాలుడి తల, చేతులు, తొడ భా గా ల్లో తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహోన్నత్‌ను వైద్యచికిత్సకోసం హనుమకొండలోని ఓ ప్రైవే ట్ హాస్పిటల్‌కు తరలించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీటికి కోతులు కూడా తోడయ్యాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రైతులకు న్యాయం జరిగేలా కృషి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : మండలంలోని రంగరాయగూడేనికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి లభించినందున, మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ జిల్లా నాయకులు తోట వెంకన్న, దైద ఎలిషన్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పగూడెం శివారు రంగరాయగూడెం గతంలో జనగామ నియోజకర్గంలో ఉండేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోకి మారినా ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. ఈ నేపథ్యంలో రంగరాయగూడేనికి చెందిన జూలుకుంట్ల లావణ్యా శిరీష్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మార్కెట్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి ఈ ప్రాంతానికి న్యాయం చేశారని తెలిపారు. ఇందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌ను లాభాల బాటలో నడిచేలా కృషి చేస్తామని, రైతులకు గిట్టు బాటు ధర లభించేలా చూస్తామన్నారు.

19న సుద్దాల హనుమంతు జాతీయ పురస్కారం ప్రదానం

కర పత్రాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 11 : దివంగత ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు జానకమ్మ దంపతుల జాతీయ పురస్కారాన్ని ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రచార కర పత్రాలను శుక్రవారం జిల్లా కేంద్రంలో కవులు, కళాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ తన తల్లిదండ్రులైన సుద్దాల హనుమంతు జానకమ్మ పేరిట ఇస్తున్న జాతీయ పురస్కారానికి అరుణోదయ నాగన్నను ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాగన్నకు జాతీయ పురస్కారం అందజేస్తారని వారు తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి యోచన, సాంబరాజు యాదగిరి, జీ కృష్ణ, పానుగంటి రామ్మూర్తి, జోగు అంజయ్య, కోడం కుమారస్వామి, అయిలా సోమనర్సింహచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, గుగ్గిళ్ల నర్సయ్య, గట్టగల్ల సంజీవ, చిలుమోజు సాయి కిరణ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, పిన్నింటి రత్నం, జనగామ శంకర్, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, చాపల మహేందర్, గూటం రమేశ్, రాగల్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఐక్య కార్యాచరణతో పోరాడాలి

జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు

జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జేఏసీ నాయకులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 11 : జనగామ జిల్లా 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని ఉద్యమ స్ఫూర్తి స్తూపం వద్ద జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు కోసం అనేక మంది పోరాడి కేసుల పాలై జైలుకు వెళ్లినట్లు తెలిపారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కళాశాల రావడానికి జేఏసీ చేసిన పోరాటమే కారణమని పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం త్వరలో జేఏసీ మరో ఉద్యమానికి సిద్ధం అవుతుందని తెలిపారు. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందితే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు బూడిద గోపి, చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి, జనగామ రచయితల సంఘం కవులు జీ కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, కాంగ్రెస్ నాయకుడు జక్కుల వేణుమాధవ్, టీడీపీ నాయకుడు బైరు బాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఉపేందర్, కిశోర్, జేఏసీ నాయకులు తుంగ కౌశిక్, అబ్బాస్, మీసాల వెంకన్న, సుభాశ్, ప్రభాకర్, యెతెందర్ స్వామి, సాయి, శ్రావణ్, జోగు ప్రకాశ్, ప్రవీణ్, అరుణ్, సన్నీ, నరేశ్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

చిల్పూరు, అక్టోబర్ 11 : దసరా సందర్భంగా మండలంలోని పల్లగుట్టకు చెందిన గ్రామ పంచాయతీ సిబ్బందికి చిల్పూరు గుట్ట ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు శుక్రవారం దుస్తులతోపాటు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది శ్రమ ఫలితంగానే గ్రామంలోని వీధులు శుభ్రంగా ఉన్నాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శి బాపునాయక్, కారోబార్ ఆనందం, వెంకట్రాజం, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు అందిస్తున్న శ్రీధర్‌రావు

ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం

మండలగూడెం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో విజేతలకు బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబర్ 11 : మండలంలోని మండెలగూడెంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆకర్షణీయమైన బతుకమ్మలను తయారు చేసిన వారిని విజేతలుగా ఎంపిక చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పొన్నాల నాగరాజు హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతి రూపంగా బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రథమ బహుమతిని దుంప రేణుక, గాదె సిద్దెంకి, వసంత, బోనాసి అరుణ, గాయత్రి, ఉమారాణి, ద్వితీయ బహుమతిని అంజమ్మ, హరిత, శోభ, రమాదేవి, సత్తమ్మకు అందించారు. తృతీయ బహుమతిని భాగ్య, కవిత, ఎలేంద్ర, అరుణ, కవితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలమణి, వెంకటమ్మ, యాదలక్ష్మి, దేవేంద్ర, మల్లమ్మ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్‌లోని చెరువు కట్టపై గురువారం జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ లయన్స్ క్లబ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు, సభ్యులు గుండేటి సంపత్, ఆమంచ మధుసూవన్, గోళి శ్రీనివాస్, పార్శి సురేశ్, పొన్న రాజేశ్, నాగేశ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు అక్కనపల్లి అంజయ్య, స్పోర్ట్స్ కన్వీనర్ పెసరు సారయ్య, కల్చరల్ కన్వీనర్ ఉబ్బని మల్లేశం, ఆర్‌ఆర్ యజమాని దారం రాజు, డాబర్ రమేశ్, యాకుబ్ పాషా, అక్కపల్లి సాయి, రజాక్, రాజేశ్, పవన్, కొలిపాక సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెబోయినగూడెంలో మాట్లాడుతున్న నర్మెట సీఐ అబ్బయ్య

దసరా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

నర్మెట, అక్టోబర్ 11: దసరా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ఎం అబ్బయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నెబోయినగూడెంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల నివారణ, సైబర్ నేరాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ అబ్బయ్య మాట్లాడుతూ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన, స్నేహాన్ని పరిశీలిస్తూ ఉండాలని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, గుట్కా, జూదం వంటి వాటిని నియంత్రించాలని సీఐ కోరారు. ఉన్నతంగా చదువుకుని రాణించాలని ఆయన సూచించారు. దసరా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై నైనాల నగేశ్, హెడ్ కానిస్టేబుల్ ఆలీముద్దీన్, కానిస్టేబుళ్లు రాజు, దనుంజయ్, ప్రవీణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

14న మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకారం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 11 : స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయం మార్కెట్ నూతన పాలక మండలి ఈ నెల 14న ప్రమాణం స్వీకారం చేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నూతన మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ పూర్తి స్థాయి పాలకమండలిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. పాలక మండలి ప్రమాణస్వీకారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

రతన్‌టాటా మృతికి నివాళులర్పిస్తున్న గంట రవీందర్

పారిశ్రామికవేత్త రతన్‌టాటాకు ఘన నివాళి

పాలకుర్తి,అక్టోబర్11: ప్రపంచ పారిశ్రామిక వేత్త, పద్మవిభూషణ్ రతన్ టాటా మృతికి పలువురు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో రతన్‌టాటా చిత్రపటం వద్ద పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గంట రవీందర్, ప్రొఫెసర్ గంట శ్యామ్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బచ్చన్నపేట, అక్టోబర్ 11 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీ-పీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్యను నివారించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇటీవలే డీఎస్సీ ద్వారా 11 వేలపై చిలుకు ఉపాధ్యాయ పోస్టులను సీఎం రేవంత్‌రెడ్డి భర్తీ చేసినట్లు వివరించారు. త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. జనగామ నియోజకవర్గ ప్రజలకు ఆయన దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంసీహెచ్ వద్ద రాస్తారోకో చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

వేతనాల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

జనగామ రూరల్, అక్టోబర్11 : మండలంలోని పసరమడ్ల శివారు చంపక్ హిల్స్ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రి ముందున్న రహదారిపై రాస్తారోకో చేశారు. పండుగ పూట వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌ను మార్చి ప్రతి నెలా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. కలెక్టర్ స్పందించి కనీసం నెల వేతనమైనా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట,అక్టోబర్ 11 : ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేశిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. దేశాభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని సోమిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలో క్రికెట్‌కు క్రేజీ ఉందన్నారు. క్రీడానైపుణ్యంతో ఆటలు ఆడితే గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు.

యశ్వంతాపూర్ సమీపంలో హైవేపై డివైడర్‌పైకెక్కిన కారు

హైవేపై డివైడర్ పైకెక్కిన కారు : పలువురికి గాయాలు

జనగామ రూరల్/దేవరుప్పుల, అక్టోబర్ 11 : వరంగల్-హైదరాబాద్ హైవేపై యశ్వంతాపూర్ వద్ద శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైవేపై వైజంక్షన్ వద్ద అగివున్న లారీని కారు ఢీకొంది. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న కారు ఇదే ప్రదేశంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టి డివైడర్‌పైకి ఎక్కింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా జనగామ-సూర్యాపేట హైవేపై సింగరాజుపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. జనగామ నుంచి పాలకుర్తి మండలం చెన్నూరుకు వెళ్తున్న కారును డ్రైవర్ సింగరాజుపల్లి వద్ద లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా మరో వాహనం ఎదురురావడంతో రోడ్డు పక్కనున్న విద్యుత్ సంబాన్ని ఢీకొట్టాడు. దీంతో కారు పైభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న వ్యక్తిపై విద్యుత్ స్తంభం పడి అతడి తలకు గాయమైంది. మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం దవఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న అధికారులు మరో స్తంభం నాటి విద్యుత్‌ను పునరుద్ధరించారు.